AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

WWW.AKSHARATODAYNEWS.COM

20-6-2026 (Saturday) MAIN EDITION

## మొబైల్ చోరీ చేసి పారిపోతుండగా గుండెపోటు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బెంగళూరులో మొబైల్ చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. దొంగతనం చేసి పారిపోతుండగా చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో, వారిలో ఒకరు గుండెపోటుతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందగా, మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు దొంగలు బైక్‌పై వచ్చి, దారిలో వెళ్తున్న ఒక వ్యక్తిని అడ్డుకుని అతని వద్ద ఉన్న మొబైల్‌ను లాక్కున్నారు. అనంతరం పారిపోయేందుకు యత్నించగా మరో వ్యక్తి అడ్డుకున్నాడు. ఈ క్రమంలో ఓ దొంగకు గుండెపోటు వచ్చి చనిపోయాడు.

## బండి భగీరథ్‌కు బెయిల్



**అక్షరటుడే, హైదరాబాద్ :** బండి భగీరథ్‌కు మల్కాజ్‌గిరి కోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. పోక్సో కేసులో గత నెల రోజులుగా రిమాండ్‌లో ఉన్న భగీరథ్, తన విద్యాభ్యాసంలో భాగంగా పరీక్షలకు హాజరుకావాల్సి ఉండటంతో, న్యాయస్థానం ఆయనకు వారం రోజుల పాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఇటీవల బండి భగీరథ్‌పై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అప్పటి నుండి ఆయన జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. తాజాగా బెయిల్ రావడంతో బయటకు వచ్చారు.

## అమరావతి వేదికగా 'యోగాంధ్ర'..



**అక్షరటుడే, ఏపీ:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉండవల్లి గుహల వద్ద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ వేడుకకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్ హాజరై, యోగా ప్రాధాన్యతను చాటిచెప్పారు.

## డీఎంకే గుడ్‌బై చెప్పిన ముస్లిం లీగ్



**అక్షరటుడే, తమిళనాడు:** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఐయూఎంఎల్ పార్టీ డీఎంకే కూటమి నుంచి తప్పకుంది. దాదాపు 60 ఏళ్లుగా డీఎంకేతో ఆ పార్టీ కలిసి పని చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో రెండు సీట్లలో పోటీ చేసి రెండు సీట్లలో విజయం సాధించింది. అనంతరం విజయ్ ప్రభుత్వానికి మద్దతు తెలిపింది.

## అన్నదాతలపై బాధ్యత లేని ప్రభుత్వం



**అక్షరటుడే, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పొన్న గ్రామంలో, జొన్న పంటను కొనుగోలు చేయడంలో జరిగిన ఆలస్యం కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన రైతు నుగూరే పాండురంగ్ కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం అన్నదాతలపై బాధ్యత లేకుండా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

## జనసేనలోకి హైదరాబాద్ మాజీ మేయర్?



**అక్షరటుడే, హైదరాబాద్ :** తెలంగాణలో పార్టీని బలోపేతం చేస్తామని, ఎన్నికల్లో సైతం పోటీ చేస్తామని జనసేన అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో తమకు కార్యకర్తలు ఉన్నారని, వారి కోసం పోటీ చేస్తామన్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌రావు జనసేనలో చేరుతారని ప్రచారం జరుగుతోంది. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ జనసేనలో చేరితో హైదరాబాద్‌లో ఆ పార్టీ బలోపేతం అయ్యే అవకాశం ఉంది. పవన్ కళ్యాణ్ కూడా సదరు నేత చేరికపై సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. అన్నీ అనుకూలిస్తే త్వరలోనే చేరిక తేదీ ఖరారయ్యే అవకాశం ఉంది.

**తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) చరిత్రలో ఇదొక సంచలన కేసుగా నమోదైంది. ల్యాండ్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరిపై ఇటీవల నమోదు చేసిన అక్రమాస్తుల కేసులో విస్తుపోయే నిజాలు బయటపడుతున్నాయి. తాజాగా ఆయనకు చెందిన బ్యాంక్ లాకర్లలో మరో కోటిన్నర రూపాయల నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

# లాకర్‌లో నోట్ల కట్టలు



- రూ.1.50 కోట్లు స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు
- భూ సర్వే శాఖ డైరెక్టర్ కేసులో కొనసాగుతున్న దర్యాప్తు
- నరహరి ఇంట్లో తవ్వేకొద్ది బయటపడుతున్న అక్రమాస్తులు

ఏసీబీ అధికారులు మంగళవారం భూ సర్వే శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఇంట్లో సోదాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఏకకాలంలో 11 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్లో భారీగా నగదు, ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. నరహరిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్న సమయంలో, ఆయన నివాసంలో మంచం కింద , ఇతర రహస్య ప్రాంతాల్లో దాచి ఉంచిన రూ. 1.5 కోట్ల నగదును ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారు. తాజాగా సోదాల్లో భాగంగా ఆయనకు చెందిన లాకర్లను తెరవగా, అందులో మరో రూ. 1.5 కోట్లు బయటపడ్డాయి. దీంతో ఇప్పటివరకు కేవలం నగదు రూపంలోనే రూ. 3 కోట్లను అధికారులు సీజ్ చేశారు.

### బ్యాంక్ ఖాతాల్లో భారీగా బ్యాలెన్స్..

ఇంట్లో దొరికిన నగదు మాత్రమే కాకుండా, నరహరికి చెందిన వివిధ బ్యాంక్ ఖాతాలను పరిశీలించిన ఏసీబీ అధికారులు, వాటిలో ఉన్న రూ. 5 కోట్లను కూడా ఫ్రీజ్ చేశారు. అంతేగాకుండా నరహరికి రంగారెడ్డి జిల్లాలోని ఐదు ఖాళీ స్థలాలు, మహేశ్వరంలోని 1.24 ఎకరాల వ్యవసాయ భూమి, పుప్పాలగూడలోని ఒక బహుళ అంతస్తుల భవనంలో 2,500 చదరపు అడుగుల విస్తీర్ణం గల ఫ్లాట్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. నర్సింగిలో ఒక బహుళ అంతస్తుల భవనంలో ఒక్కొక్కటి 1,860 చదరపు అడుగుల విస్తీర్ణం గల రెండు ప్లాట్లు, రాజేంద్ర నగర్‌లోని ఒక బహుళ అంతస్తుల భవనంలో 1,377 చదరపు అడుగుల విస్తీర్ణం గల ఒక ఫ్లాట్‌కు సంబంధించిన పత్రాలు లభించాయి. గచ్చిబౌలిలోని టీఎన్‌జీఓస్ కాలనీలో ఉన్న ఒక జీ+3 భవనం, చత్రినాకలో ఒక జీ+2 నివాస భవనం ఉంది. మొత్తం ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్ లో రూ.వంద కోట్లకు పైగా ఉంటుంది.

### మరిన్ని లాకర్ల తనిఖీకి సన్నాహాలు..

ఈ కేసులో ఇంకా కీలకమైన రెండు లాకర్లను తెరవాల్సి ఉందని ఏసీబీ వర్గాలు తెలిపాయి. ఆ లాకర్లలో కూడా భారీగా నగదుతో పాటు, భూములు, ఇతర ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలు దొరికే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ దాడుల నేపథ్యంలో డిప్యూటీ డైరెక్టర్ నరహరి అక్రమ సంపాదన లెక్కలు ఎంతవరకు వెళ్తాయోనని రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోంది.

## లంచం అడుగుతున్న డిప్యూటీ సీఎం: కవిత



**అక్షరటుడే, భూపాలపల్లి :** సింగరేణి సమస్యలపై టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె భూపాలపల్లి జిల్లాలో గనులను పరిశీలించారు. సింగరేణి అధికారుల పీఆర్పీ చెల్లింపునకు డిప్యూటీ సీఎం లంచం అడుగుతున్నారని కవిత ఆరోపించారు. నిషేధిత డిటోనేటర్ల కొనుగోలు, కారుణ్య నియామకాలు, మెడికల్ బోర్డు వంటి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూలై 20 వరకు ప్రభుత్వానికి డెడ్‌లైన్ విధించారు. జూన్ 20న భూపాలపల్లి కాకతీయ ఖని 5 గని పై కార్మికుల సమక్షంలో ప్రభుత్వానికి నెల రోజుల గడువు ఇస్తున్నామని తెలిపారు. జులై 20లోగా సింగరేణి కార్మికుల కోసం మెడికల్ బోర్డు నిర్వహించకుంటే గాంధేయ మార్గంలో నిరాహార దీక్షకు దిగుతానని ఆమె హెచ్చరించారు.

## మైనంపల్లి సంచలన వ్యాఖ్యలు




**అక్షరటుడే, మల్కాజ్‌గిరి:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తనను ఉద్దేశించి కేటీఆర్ చేసిన 'గుండాయిజం' వ్యాఖ్యలను మైనంపల్లి తిప్పికొట్టారు. ఫోన్ ట్యాపింగ్, సెలబ్రిటీల జీవితాలను నాశనం చేయడమే కేటీఆర్ నైజమని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. తాను గుండాయిజం చేస్తాడని కేటీఆర్ నిందలు వేయడం సరికాదని, తన చరిత్ర ఏమిటో ప్రజలందరికీ తెలుసని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేయడం, ప్రముఖుల, సెలబ్రిటీల జీవితాలను నాశనం చేయడమే కేటీఆర్ పని అన్నారు.

## రేపు ట్రాఫిక్ ఆంక్షలు

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ఆదివారం ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. హెచ్ సిటీ ప్రాజెక్టు పనులతో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయన్నారు. పార్క్ పరిసరాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వన్‌వే ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు. కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న ప్రధాన రోడ్లలో ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాట్లు చేశారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, రోడ్ నెం.36, రోడ్ నెం.45 వైపు వెళ్లేవారు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు.

## ఆర్టీఏ అధికారుల తీరుతో ప్రయాణికుల అవస్థలు




**అక్షరటుడే, ఖైరతాబాద్ :** ఆర్టీఏ అధికారుల తీరుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఖైరతాబాద్ ఆర్టీఏ అధికారులు హైదరాబాద్ నుండి రాజస్థాన్ వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. నిబంధనలు, అనుమతులు సక్రమంగా లేకపోవడంతో దానిని సీజ్‌చేశారు. అందులో ఉన్న ప్రయాణికులతో సహా బస్సును ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయానికి తరలించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో 50 మంది ప్రయాణికులు ఉదయం వరకు కార్యాలయంలోనే నిరీక్షించారు. తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## ఐఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్.. టాప్ 5లో హైదరాబాద్ యూనివర్సిటీ




**అక్షరటుడే, హైదరాబాద్ :** ఐఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్ 2026 ప్రకారం దేశంలోని టాప్ 10 కేంద్ర విశ్వవిద్యాలయాల జాబితాలో హైదరాబాద్ విశ్వవిద్యాలయం చోటు దక్కించుకుంది. దేశంలోని యూనివర్సిటీల్లో సౌకర్యాలు, బోధన, ఇతర వసతులను పరిగణనలోకి తీసుకొని ఈ ర్యాంకింగ్స్ విడుదల చేస్తారు. ఈ జాబితాలో ఢిల్లీలోని జేఎన్‌యూ మొదటి స్థానంలో ఉండగా, ఢిల్లీ యూనివర్సిటీ, జామియా మిల్లియా ఇస్లామియా యూనివర్సిటీ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. నాలుగో స్థానంలో హైదరాబాద్ విశ్వవిద్యాలయం చోటు దక్కించుకుంది. కాశీలోని బనారస్ యూనివర్సిటీ ఐదో స్థానంలో నిలిచింది.

## పేదల గుడిసెల తొలగింపు



**అక్షరటుడే, వరంగల్ :** హన్మకొండ జిల్లా గుండ్ల సింగారంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సీపీఐ ఆధ్వర్యంలో వేసిన పేదల గుడిసెలను అధికారులు తొలగించారు. గుండ్ల సింగారం ప్రాంతంలో కొన్నేళ్లుగా పేదలు నివాసం ఉంటున్నారు. అయితే శనివారం తెల్లవారుమున అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య అక్కడకు చేరుకున్నారు. జేసీబీల సాయంతో గుడిసెలు, షెడ్లను కూల్చవేశారు. కూల్చివేతలను అడ్డుకోవడానికి స్థానికులు యత్నించారు. ఈ క్రమంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. అయితే పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## కన్నకొడుకునే హత్య చేయించిన తల్లి




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో దారుణం చోటు చేసుకుంది. ప్రియుడి మోజులో పడి ఓ మహిళ తన కుమారుడిని హత్య చేయించింది. తన ఆరేళ్ల కొడుకుతో నివాసం ఉంటున్న గుర్‌ప్రీత్ కౌర్ అనే మహిళకు ప్రైవేట్ బ్యాంక్ మేనేజర్ అర్పిత్ శర్మతో వివాహేతర సంబంధం ఏర్పడింది. తమ సంబంధానికి అడ్డంకిగా మారాడనే కారణంతో, అతడిని హత్య చేయాలని పథకం వేసింది. ఈ మేరకు అతడిని ప్రియుడి కారులో పంపింది. అనంతరం అర్పిత్ శర్మ బాలుడి గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం హస్తినాపూర్ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో మృతదేహాన్ని పడేశాడు. పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు.

## బిడ్డల ముందే అమానుషం..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఛత్తీస్‌గఢ్ కోరియా జిల్లాలో అమానుష ఘటన చోటు చేసుకుంది. సభ్య సమాజం తల దించుకునే పనిచేశాడు ఓ వ్యక్తి. తన భార్య ప్రవర్తనపై అనుమానంతో జితేంద్ర ఘూసియా అనే వ్యక్తి కన్న బిడ్డల ముందే ఆమెను చిత్రహింసలకు గురిచేశాడు. బాధితురాలి కాళ్లు, చేతులు కట్టేసి గుండు గీయించడంతో పాటు బలవంతంగా మూత్రం తాగించాడు. ఆపై వీడియో కూడా తీశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో పోలీసులు చర్యలు చేపట్టారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

## కుంభమేళా మోనాలిసాకు ఊరట



**అక్షరటుడే, కేరళ:** మోనాలిసా భోస్లేకు కేరళ హైకోర్టు రక్షణ కల్పించింది. తమ ప్రాణాలకు ముప్పు ఉందని, భద్రత కల్పించాలంటూ ఆమె తన భర్తతో కలిసి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, ఆమెకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. మోనాలిసా, తన ప్రియుడు ఫర్మాన్ ఖాన్‌ను వివాహం చేసుకుంది. అయితే, తమ కూతురు మైనర్ అని, ఆమెను ఫర్మాన్ అపహరించుకుపోయాడంటూ మోనాలిసా తండ్రి ఫిర్యాదు చేశారు. దీంతో మోనాలిసా దంపతులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన కోర్టు మోనాలిసాకు తగిన రక్షణ కల్పించాలని ఆదేశించింది.